క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో ఉరుములు, మెరుపుల కారణంగా 8 ఎమ్‌వీఏ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కాలిపోయింది. దీంతో మరమత్తుల నిమిత్తం త్రిపురారం సబ్ సబ్ స్టేషన్ పరిధిలో నేడు(మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిపురారం, సత్యనారాయణపురం, బెజ్జికల్, మట్రిగూడెం, కంపాసాగర్, కొమటిగూడెం, దుగ్గెపల్లి, నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసుతన్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగే గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

దామరచర్లలో

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని నూనావత్‌తండా సబ్ స్టేషన్‌లో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్ కావడంతో దాని స్థానంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చడానికి మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అబ్దుల్లా హబీబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని నూనావత్‌తండా, కేశవాపురం, కొండ్రపోల్, రాంకీ పీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిరిషావలి మృతి సీపీఐకి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డిండి: మండల పరిధిలోని తవక్లాపూర్ సీపీఐ గ్రామ శాఖ సభ్యుడు మహ్మద్ శిరిషావలి మృతి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నారు. సోమవారం తవక్లాపూర్ గ్రామంలో శిరిషావలి మృతదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.మైనొద్దీన్, మండల కార్యదర్శి కనకచారి, సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్, వెంకటేశ్వర్లు, చక్రి, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



దీక్ష ప్రారంభించి మాట్లాడుతున్న నరేష్

దేవరకొండ : ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆయన ప్రజాతంత్ర బాధ్యులు వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 540 గురుకులాల్లో సమస్యలు తిష్ట వేశాయని వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో వేల కోట్ల విద్యార్థుల ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో పేద విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బుడిగ వెంకటేశ్, రమావత్ లక్ష్మణ్‌నాయక్, రాకేష్, ఇద్దిరాములు, జైచరణ్, శివ, శివయ్య, భాను, చరణ్‌తేజ్, కావ్య, నందిని, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విప్లవ రైతు సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: ఎన్నికల ముందు ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని విప్లవ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, సత్తయ్య, మారయ్య, వెంకటేశ్వర్లు, సుగునమ్మ, ఎడ్ల భాస్కర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

హాలియా : కిశోరబాలికలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఏసీడీపీఓ సునంద అన్నారు. రామడుగు సెక్టార్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చల్మారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలు రాగులు, సజ్జలు, జొన్నలు, పండ్లు, ఆకుకూరలు, కూర గాయలు, పప్పు ధాన్యాలు ఆహారంలో తీసుకుంటే రక్తహీనత లోపం ఏర్పడకుండా ఉంటుందన్నారు. అనంతరం కిశోర బాలికలకు పోషకాహారం గురించి, ఏఏ పదార్థాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయే వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎన్ శ్రీదేవి, జే శ్రీదేవి, హెల్త్ స్టాఫ్ గౌసియా బేగం, ఎంఎల్‌టీ నాగరాజు, ఆశాలు, స్కూల్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెరుగుదలపై అంగన్‌వాడీ పర్యవేక్షణ

మిర్యాలగూడ టౌన్ : పిల్లల పెరుగుదలపై ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పర్యవేక్షణ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలాకుమారీ అన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు అశోక్ నగర్‌లో గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలికలకు రక్త నమునాలతో పాటు వైద్య పరీక్షలను డాక్టర్ నిపుణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ మాసంలో భాగంగా మంచి పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. రక్తహీనత వలన కలిగే నష్టాలు, పౌష్టికాహారంతో పలు అంశాలపై అగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, జ్యోతి, విజయలక్ష్మి, లతీఫాసుల్తానా, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణి, ఏఎన్ఎం నాగమణి, అశా వర్కర్ రాణి తదితరులున్నారు.



హాలియా : చల్మారెడ్డిగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సునంద

వేములపల్లి(మాడుగులపల్లి) : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీన నివారణకు పోషకాహారం తీసుకోవాలని ఆరోగ్యంగా ఉండాలని సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. సోమవారం మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, పప్పులు, నువ్వులు, బెల్లం, పాలు, గుడ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, లలిత, ఎంసీహెచ్‌పీ జ్యోతి, హెచ్ఏ సోమాచారి, ఏఎన్ఎం జ్యోతి, ఆశ వర్కర్ కేసాని జయమ్మ, కిశోరబాలికలు పాల్గొన్నారు.

త్రిపురారం : బాలికలకు పౌష్టికాహారంతోనే రక్తహీనత దూరమవుతుందని, రోజువారి ఆహారంలో పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలని నిడమనూరు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సైదాబేగం అన్నారు. సోమవారం నిడమనూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో, త్రిపురారం మండలంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో వైద్యసిబ్బంది అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి రక్తపరీక్షలు నిర్వహించి పోషకాహారంపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్, నిడమనూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, మేరి, సుమలత, అంగన్ వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



చందంపేట : విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వేములపల్లి : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగమణి

విద్యార్థినులకు రక్త పరీక్షలు

చందంపేట : మండల కేంద్రంలో కేజీబీవీ స్కూల్‌లో కిశోర బాలికలకు చందంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెచ్‌బీ రక్త పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వెద్యాధికారి చందులాల్ విద్యార్థినులు ఆరోగ్యపరమైన తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏసీడీపీఓ ఖాతిజాబేగం, సూపర్‌వైజర్లు సత్యకుమారి, ప్రసన్న, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు ఇబ్బందులు కలిగించొద్దు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఆయా వార్డులు తిరిగి రోగులకు అందుతున్న చికిత్సను, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో, సిబ్బందితో మాట్లాడుతూ ఉదయం 10గంటలకే ఓపీ ప్రారంభమవుతున్నందున సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమయపాలన పాటించని వైద్యులపై, సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



మిర్యాలగూడ : దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్

మిర్యాలగూడ : ప్రజావాణిలో ప్రజలు అందించే దరఖాస్తులను పరిశీలించి సత్వరమనే సమస్యలను పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఉంటారని, అర్హులైన ప్రజలకు సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేస్తారన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

త్రిపురారం : మండల కేంద్రంలోని రైతు వేదికలో తి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని త్రిపురారం ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. సోమవారం పలు గ్రామాల ప్రజల నుంచి ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి మండల అధికారులు విధిగా హాజరుకావాలని నిర్లక్ష్యం చేసే అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య ప్రజా పాలనలో దరఖాస్తు చేసున్న వారి పెండింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలని పెద్దదేవులపల్లి గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓకు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 18 దరఖాస్తుల స్వీకరణ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుంచి 18దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. అందులో 15 దరఖాస్తులు మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించినవి కాగా మరో మూడు దరఖాస్తులు రెవెన్యూ విభాగానికి సంబంధించినవి అని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రశాంత్, డీపీఓ సీజెఎస్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'లో భాగస్వామ్యం కావాలి



హాలియా : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి

హాలియా : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని హాలియా మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల(మెప్మా)కు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పట్టణంలోని 1వ వార్డులో పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి, పరిసరాల పరిశుభ్రత, తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరకొండ : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో దేవరకొండ పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కౌన్సిలర్ భూదేవిసైదులు, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ సక్కునాయక్ అన్నారు. సోమవారం ఖిల్లా పార్క్ సమీపంలో పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ మున్సిపాల్టీని పరిశుభ్రతలో మొదటి స్థానంలో నిలిపేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. ఆయా కాలనీల్లో చెత్తా చెదారం పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్,వార్డు అధికారులు, తదితరులున్నారు.



దేవరకొండ : పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కౌన్సిలర్, తదితరులు

క్రీడల్లోనూ రాణించాలి

రామగిరి(నల్లగొండ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యూత్ ఫీస్ట్ రెడ్ రన్ 2024లో భాగంగా జిల్లా స్థాయి 5కె మారథాన్ పోటీలను సోమవారం నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి పసుపుల మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పరంగి రవి కుమార్, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ ప్రసన్న కుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.నాగరాజు, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ భాగ్యలక్ష్మి , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఎం. వెంకటరెడ్డి, ఎన్. కోటయ్య, అనిల్ కుమార్ బొజ్జ,ఎమ్. సావిత్రి, తెలుగు ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

'పట్టుదల ఉంటే విజయం మీ వెంటే'

మిర్యాలగూడ టౌన్ : క్రీడాకారుల్లో పట్టుదల, కృషి ఉంటే విజమం మీ వెంటే ఉంటుందని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వీరస్వామి అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో క్లియో ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -2 ఆదివారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఎంవీఐ మాట్లాడుతూ గెలుపు ఓటములు అనేవి సహజమని, వాటిని అధిగమించేందుకు వచ్చే పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. ఈ టోర్నీలో విజేతగా చైతన్య స్కూల్ నిలవగా రన్నరప్‌గా అభ్యాస్ స్కూల్ నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా చైతన్య స్కూల్‌కు చెందిన వి. అభిలాష్, బెస్ట్ బౌలర్‌గా అభ్యాస్ స్కూల్ కుచెందిన కె. నవీన్‌కుమార్, బెస్ట్ ఫీల్డర్‌గా కర్నాన్ స్టోన్ స్కూల్‌కు చెందిన కె. అశోక్ దావన్, మ్యాన్ ఆఫ్‌ది సీరిస్‌గా ధీరాజ్ రామస్వామి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఏచూరి శ్రీనివాస్, చిల్లంచర్ల శ్రీను, క్లియో కోచ్‌లు ఎం. రామకృష్ణ, వెంకన్న, రాజు, జయశ్రీ, పూజితలతో పాటు పలువురు క్రీడాకారులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంవీఐ వీరస్వామి

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

దేవరకొండ : పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ నీలిమకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా మండల పరిధిలోని పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, అలమోని మల్లయ్య, వీరయ్య, నరసింహా, అయోధ్య, ఇద్దయ్య, పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి పంచాయతీలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా ప్రజావాణిలో సమచార హక్కు సమితి సభ్యుడు ఇరిగి క్రాంతి కుమార్ పంచాయతీ సిబ్బందితో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బందికి కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.



త్రిపురారం :అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రాంతి కుమార్, కార్మికులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

మిర్యాలగూడ అర్బన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. కార్మిక సంఘాల పిలుపుమేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొత్త చట్టాల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, మంద రాజు, గోవర్ధన్‌రెడ్డి, సోములు, క్రాంతి, గౌస్, అజీమ్, వెంకన్న, పాల్గొన్నారు.

మిర్యాలగూడ : కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కార్మికుల హక్కులను కాలరాసేందుకుగాను కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక వ్యతిరేక చట్టాల ప్రతులను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, మంద రాజు, గోవర్ధన్‌రెడ్డి, సోములు, క్రాంతి, సతీష్, గౌస్, అజీమ్ ఉన్నారు.



మిర్యాలగూడ అర్బన్ : కొత్తచట్టాల ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లింగయ్య, ఇక్బాల్, వెంకటయ్య, బుచ్చయ్య, నరసింహా ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మిర్యాలగూడ టౌన్ : ఎలాంటి అనుమతులు లేకుండా రైస్ మిల్లుల యాజమాన్యం అక్రమంగా అదనపు నిర్మాణాలను చేపడుతున్నారంటూ సోమవారం నల్లగొండలో కలెక్టర్ నారాయణరెడ్డికి యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన గువ్వల సైదులు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ రాజ్ అధికారుల కనుసన్నాల్లోనే అదనపు నిర్మాణాలను చేపట్టి తక్కువ పన్నులను చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్‌కు ..

మిర్యాలగూడ పట్టణంలోని తెలంగాణ ఆటో మోటార్స్ ట్రేడ్ యూనియన్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు ఆ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి మహ్మద్ నాజర్ అలీ మిర్జా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫర్వేజ్, మిర్యాలగూడ యూనియన్ ఉపాధ్యక్షులు ఫర్వేజ్‌ఖాన్, భూక్య రవి, సయ్యద్ తదితరులున్నారు.

మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న పురుషోత్తం రెడ్డి

వేములపల్లి(మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన బొప్పని శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు గడ్డం పురుషోత్తంరెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌని నిరంజన్, మంగా యాదయ్య, గున్‌రెడ్డి మణెమ్మ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాము, యాదగిరి తదితరులు ఉన్నారు. అలాగే బొమ్మకల్ గ్రామానికి చెందిన సీరుడు ఆశీర్వాదం అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ మారుతి వెంకట్‌రెడ్డి సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వెంకటయ్య, వెంకన్న, అశోక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు కల్పించాలని దీక్ష

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు గాదగోని మహేష్ గౌడ్ అధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. ఈ దీక్షను బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు ప్రారంభించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, ఉద్యోగ సంఘాల నేతలు మారం శ్రీనివాస్, కోల సైదులు, డాక్టర్ రాజులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పొదిల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని సీఎం కచ్చితంగా అమలు చేస్తారని, బీసీ గణనను చేపట్టిన తరువాతనే ఎన్నికలకు వెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు గాదగోని మహేష్ గౌడ్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, బసవయ్య, వెంకటేష్‌గౌడ్, ఈశ్వరాచారి, వెంకన్న, రాజు, కృష్ణ, అనిల్‌కుమార్, రమేష్, శివ, భీమరాజు, పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లపై సీఎం స్పష్టత ఇవ్వాలి

బీసీల రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల కుల గణనను చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 8నెలలు అవుతున్నప్పటికీ ఈ విషయంపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, నర్సింహ, మహేశ్వరపు నరేష్, పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : దీక్షలో పాల్గొన్న బీసీ నేతలు

క్రీడలు ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎంఈఓ తరి రాము అన్నారు. సోమవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్, ఎన్ వెంకటయ్య, జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ గేమ్స్ ప్రారంభిస్తున్న ఎంఈఓ తరి రాము

రైతు వేదికలో నేడు అవగాహన సదస్సు

మిర్యాలగూడ అర్బన్ : పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారి సహకారంతో మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ వ్యవసాయ శాఖ అధికారి సైదానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వీపీఎస్ సాయిబాబా, సీఏడీ శ్రీనివాస్, సీనియర్ ఆగ్రనమిస్ట్ డాక్టర్ సుబ్బారావులు హాజరవుతారని పేర్కొన్నారు.

పశువైద్యుడు లేక తిప్పలు

- మూడు నెలల కిందట బదిలీపై వెళ్లిన పశువైద్యాధికారి
- ఇప్పటికీ వైద్యుడిని నియమించని ప్రభుత్వం

వేములపల్లి : మండలంలోని ఆమనగల్లు పశువైద్యశాలలో రైతులకు, ప్రజలకు పశువైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో మూడు నెలలుగా ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి బదిలీపై వెళ్లడంతో గ్రామంలోని పశువులకు ఇబ్బందులు ఎదురైతే పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని లక్ష్మీదేవిగూడెం, ఎరుకలగుట్ట, చలిచీమలపాలెం, తాళ్లగడ్డ గ్రామాల నుంచి ప్రజలు తమ పశువులను ఆమనగల్లులోని పశువైద్యశాలకు తీసుకొస్తుంటారు. అంతదూరం నుంచి పశువులను వైద్యం చేయించడానికి తీసుకొస్తే తీరా ఆస్పత్రిలో వైద్యులు లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగి వెళ్లాల్సి వస్తుందని, తమ పశువులకు వైద్యం ఎలా చేయించుకోవాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని పలువురు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యలకు వైద్యుడిని కేటాయించి పశువైద్యశాలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి తమ ఇబ్బందులను తొలగించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.



ఆమనగల్లులోని పశువైద్యశాల